నిబంధనలు గాలికి..



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ మండలంలోని యశ్వంత్ గూడ గ్రామ పంచాయతీ శివారు ప్రాంతంలో వెలిసిన ఇటుక బట్టీ. గ్రామానికి సమీపంలోనే ఇటుక బట్టీ ఉండడంతో ఇటుకల తయారీ నుంచి వచ్చే పొగతో వాతావరణం కలుషితమై ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంది. ఇది ఒకటి కేవలం ఉదాహరణకు మాత్రమే. ఇలాంటివి మండలంలో మారెన్నో ఉన్నాయి. అధికారులు స్పందించి గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

- ఏజెన్సీలో ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీల నిర్వహణ
- ఇళ్ల సమీపంలోనే తయారీ
- అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు

ఆదిలాబాద్‌రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలు వెలిశాయి. కొన్నిచోట్ల ఇటుక వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండానే సమీపంలోని అటవీ, చెరువుల నుంచి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఇటుక వ్యాపారం చేయకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ ఇటుక వ్యాపారులు వాటిని బేఖాతారు చేస్తూ.. వారి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

మండలంలో ఇటుక బట్టీల తయారీకి రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. అక్రమంగా ఇటు బట్టీలు వెలిసినట్లు మా దృష్టిలో రాలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలు కొనసాగిస్తే తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం. త్వరలో ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తాం.

– దిలీప్ కుమార్, తహసీల్దార్, ఆదిలాబాద్ రూరల్

ఇళ్ల సమీపంలో..

మండలంలోని కొన్ని గ్రామాల్లో గ్రామానికి అనుకొని ఇటుకల తయారీలు చేస్తున్నారు. దీంతో సమీపంలోని ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంది. వేసవిలో ఎండలు దంచి కొడుతున్నాయి. ఇటుకలు కాల్చే సమయంలో మంట పెడుతుంటారు. ఆ వేడికి గ్రామంలో మరింత వేడి ఉంటుందని పలు గ్రామాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. దీంతో ప్రజలు రాత్రి వేళల్లో వేడిని తట్టుకోలేకపోతున్నారు.

ఎలాంటి అనుమతులు లేకుండా..

మండలంలో ఆయా ప్రాంతాల్లో వెలిసిన ఇటుక బట్టీలకు ఎలాంటి అనుమతులు లేవు. దీంతో గ్రామ పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి కూడా గండి పడుతోంది. అనుమతులు తీసుకొని ఇటుక తయారీలు చేస్తే గ్రామ పంచాయతీకి కూడా కొంత మేర ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది. కానీ అలాంటివీ ఏమీ లేకుండానే వ్యాపారం కొనసాగుతోంది.

క్లుప్తంగా

నేటి నుంచి శనగ కొనుగోళ్లు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం నుంచి పీఏసీఎస్, నాఫెడ్ ఆధ్వర్యంలో శనగ కొనుగోళ్లు చేపట్టనున్నట్లు పీఏసీఎస్ సీఈవో ధరం సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో శనగ క్వింటాల్‌కు రూ. 5440లతో కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు పండించిన శనగ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్మి మద్దతు ధర పొందాలని కోరారు.

రాథోడ్ గణేష్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

ఇంద్రవెల్లి: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాథోడ్ గణేష్ మృతి పార్టీకి తీరని లోటని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని లాల్‌టెడికి గ్రామానికి చెందిన రాథోడ్ గణేష్ అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ముఖడే ఉత్తం, సోమోరే నాగోరావ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాథోడ్ వసంత్‌రావ్, తదితరులు ఉన్నారు.

ఓటుహక్కు నిర్భయంగా వినియోగించుకోవాలి



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఇంద్రవెల్లి ఎస్సై దుబ్బక సునీల్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని వాల్గొండ గ్రామంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు ప్రజల్లో ఉన్న భయాందోళనలు తొలగిపోవాలనే ఉద్దేశంతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మోహన్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న బలరాంజాదవ్

నేరడిగొండ: మండల కేంద్రంలో సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తెలంగాణ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాబ్లే సంతోష్ సింగ్ సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుండడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి ఏడాది వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

చేతులను శుభ్రంగా కడగాలి

ఆదిలాబాద్‌టౌన్: భోజనం చేసే ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడగాలని అంగన్‌వాడీ కార్యకర్త కవిత అన్నారు. బుధవారం పట్టణంలోని భుక్తాపూర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. చిన్నారులతో పాటు తల్లిదండ్రులకు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో రుబీన, ఆస్మా అన్జుమ్, అనూష, సుజాత, ఇర్ఫాన, రాధ, లావణ్య, సీమ, ఫర్హీన్, దేవి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

తాంసి: మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన దర్శనాల విలాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా.. బాధిత కుటుంబసభ్యులను ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి తనవంతుగా రూ.10వేల ఆర్థిక సాయం అందజేశాడు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. వారి వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింగ్, జైనథ్ జెడ్పీటీసీ వెంకట్ రెడ్డి, పోతన్న, శంకర్, సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఈసీసీఈ డే

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ అంగన్‌వాడీ కేంద్రం– 7లో బుధవారం అర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) డేను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ కవిత పిల్లల తల్లులకు పోషకాహారం, పిల్లలకు మేధో వికాసం, కండరాళ్ల అభివృద్ధి తదితర అంశాల గురించి వివరించారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రుబీన, ఆస్మా, అంజలి, అనూష, సుజాత, ఇర్ఫాన, రాధ, లావణ్య, సీమ, ఫర్హీన్, దేవి పాల్గొన్నారు.

'కార్యకర్తలే పార్టీకి బలం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

తలమడుగు: పార్టీకి కార్యకర్తలే బలమని, ఎవరూ అధైర్య పడొద్దని బోథ్‌ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని సుంకిడి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త బీఆర్ఎస్ గెలుపు కోసం రాత్రి పగలు కష్టపడాలన్నారు. కష్టపడే వారిని పార్టీ గుర్తించి, ఉన్నత పదవులు ఇస్తుందన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. మండల కన్వీనర్ తోట వెంకటేశ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కేదారేశ్వర్ రెడ్డి, కిరణ్ కుమార్, అభిరామిరెడ్డి, అశోక్, రంజిత్ రెడ్డి, రమాకాంత్, జనార్దన్, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం వద్ద దాహార్తి తీర్చుకున్న ఎమ్మెల్యే

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దాహార్తి తీర్చుకున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున చలివేంద్రాల ప్రజల దాహార్తి తీరుస్తాయన్నారు. వారి వెంట బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రఘు, మాజీ సర్పంచ్ అశోక్, తదితరులు ఉన్నారు.

టెట్ లేకుండా పదోన్నతి కల్పించాలి



మాట్లాడుతున్న సునీల్ చౌహాన్

బజార్‌హత్నూర్: టెట్‌తో సంబంధం లేకుండా ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. టెట్ విషయంలో ఉపాధ్యాయులందరు గందరగోళంలో ఉన్నారని, ప్రభుత్వం స్పందించి వెంటనే టెట్‌పై స్పష్టత ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం టీపీయూఎస్ జిల్లా స్థాయి నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సునీల్ చౌహాన్, కార్యదర్శి రాథోడ్ మనోజ్ కుమార్, కోశాధికారిగా ఉయికే గంగాధర్, ఉపాధ్యక్షుడిగా రాథోడ్ జ్ఞానేశ్వర్, మీడియా కన్వీనర్‌గా రాథోడ్ అశ్విన్, కార్యదర్శులు చౌహాన్ సంతోష్, కోవ గంగారాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మెస్రం రాజ్‌కుమార్, బచ్చువార్ నారాయణ, బత్తుల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సఖీ కేంద్రం నిర్వాహకులు

ఆదిలాబాద్‌రూరల్: సఖీ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సఖీ కేంద్రం నిర్వాహకురాలు నాగమణి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చర గ్రామ శివారులో ఉపాధిహామీ పనులకు వెళ్లినా మహిళలతో మాట్లాడారు. సఖీ కేంద్రం ఆధ్వర్యంలో కౌన్సెలింగ్, న్యాయ, పోలీస్ సహాయంతో పాటు వైద్య సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. మహిళలు వారికి ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస, బాల్యవివాహాలు, ఫోక్సో చట్టం, సైబర్‌క్రైం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ లచ్చరెడ్డి, కూలీ పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న మంజుల

నేరడిగొండ: వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. బుధవారం మండలంలోని కుంటాల(కె) అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యం, పారిశుధ్యం, న్యూట్రీషన్ ప్రోగ్రాంలో భాగంగా పోషకాహారం, వడదెబ్బ తగలకుండా పిల్లలు, పెద్దలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఐకేపీ సీసీ కవిత, అంగన్‌వాడీ టీచర్, ఆశ కార్యకర్తలు, ఐకేపీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా వడదెబ్బ బారిన పడకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ టీచర్ రాధ అన్నారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. ఉదయం, సాయంత్రం మాత్రమే ఇంటి నుంచి బయటకు వెళ్లాలని సూచించారు. ఎండలో పనులు చేపట్టే వారు ఓఆర్ఎస్ ద్రవం తీసుకోవాలని సూచించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే, భక్తులు

తలమడుగు: మండలంలోని సాయిలింగి గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నెత్తిన బోనం ఎత్తుకొని ఆలయానికి వచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తుల సహకారంతో నూతన ఆలయం నిర్మించి విగ్రహ ప్రతిష్ఠాపన చేయడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు అశోక్, పోచ్చన్న, వెంకటేశ్, పొచన్న, ప్రమోద్, అశోక్. అభిరామిరెడ్డి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం

బేల: మండలంలోని డోప్టాల గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహ ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన వీధుల గుండా పల్లకీ శోభయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమాన్ ఆలయం ప్రాంగణంలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. అనంతరం కాలదహి హండీ నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఏఐటీయూసీలో చేరిక



ఏఐటీయూసీలో చేరిన ఆశ కార్యకర్తలు

బజార్‌హత్నూర్: ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ఆధ్వర్యంలో బుధవారం మండలానికి చెందిన 55 మంది ఆశ కార్యకర్తలు సీఐటీయూ నుంచి ఏఐటీయూసీ కార్మిక సంఘంలో చేరారు. ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కళ్ళెపెల్లి గంగయ్య, చంద్రకళ, మండల కార్యదర్శి కీర్తి రమణ, రవీందర్, గంగామణి, కల్పన, మనీష, జయమాల, కళ, దుర్గవ్వ, జ్యోతి, గంగుబాయి, అనిత, లలిత, రాధ, జైశీలా, కవిత, తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సిడాం రాంకిషన్

ఎదులాపురం: క్రాంతివీర్ రాంజీగోండ్ 164వ వర్ధంతి వేడుకలను విజయవంతం చేయాలని హీరాసుక జాగృతి సమితి జిల్లా అధ్యక్షుడు సిడాం రాంకిషన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. రాంజీగోండ్ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసారని, ఊడల మర్రిపై ఉరి తీయబడ్డారని గుర్తు చేశారు. అలాంటి యోధుడి జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రాంజీగోండ్ విగ్రహం వద్ద ఈనెల 9న నిర్వహించ తలపెట్టిన రాంజీగోండ్ వర్ధంతి వేడుకకు ఆదివాసీ తెగలు, అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక జామా మసీదులో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మసూద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విరమించారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ మండల అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు మహ్మద్ జహీర్, ఎండీ జునైద్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న మోహన్ నాయక్



నీటి తొట్టిలు ప్రారంభిస్తున్న కంది శ్రీనివాస రెడ్డి

ఇచ్చోడ: గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మండల ప్రత్యేకాధికారి పుల్లయ్య, ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. బుధవారం మండలంలోని బోరిగామ, బాదిగూడ, దాబా(కె) గ్రామాల్లో పర్యటించి నీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి నీటి ఎద్దటి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

బజార్‌హత్నూర్: గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మోహన్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో తాగునీటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిన సమయంలో ఇతర మార్గాల ద్వారా నీటిని అందించాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ భీం రావ్ మాట్లాడుతూ.. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అతుల్ కుమార్, ఎంపీహెచ్‌వో ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చడం అభినందనీయం

ఆదిలాబాద్‌టౌన్: వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చడం అభినందనీయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ అధ్యక్షుడు అజీజ్ మసూద్ చౌక్‌లో నీటి తొట్టిలను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సాబిర్ హుస్సేన్, ముజహీద్, రవీందర్, మోయిజ్, చిన్నయ్య, సురేశ్, ఖయ్యూం, అతీకొద్దిన్ పాల్గొన్నారు.

ప్రతీ కూలీకి పని కల్పించాలి



వడూర్‌లో పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో

నేరడిగొండ: ప్రతీ కూలీకి పని కల్పించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. బుధవారం మండలంలోని వడూర్ గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉదయం పూట పనులకు వచ్చి పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే రైతులకు ఉపయోగపడే పనులను ఉపాధిహామీ టీఏలు, ఎఫ్ఏలు కూలీల ద్వారా చేయించాలని ఆదేశించారు. కూలీలు అధిక సంఖ్యలో రావడంతో ఉపాధిహామీ సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, టీఏ రజిత, ఎఫ్ఏ నర్సయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

తాంసి: మండలంలోని బండల్‌నాగాపూర్ గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఉపాధి పనుల్లో భాగంగా చేపడుతున్న సాగుభూమి అభివృద్ధి, కందకాల తవ్వకాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కూలీల హాజరును రోజువారీగా నమోదు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. వారి వెంట టీఏ రాజన్న, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి, తదితరులు ఉన్నారు.

ఆలయం చుట్టూ కంచె ఏర్పాటు



కంచె ఏర్పాటు చేస్తున్న గోండ్‌గూడ ఆదివాసీలు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయం చుట్టూ బుధవారం గోండ్‌గూడ ఆదివాసీలు కంచె ఏర్పాటు చేశారు. త్వరలో నిర్వహించే చైత్రి మాసం పూజలకు ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీలు తరలిరానున్నారు. దీంతో కంచె ఏర్పాటు చేసినట్లు ఆలయ మహారాజ్ చహకటి సూర్యరావ్ తెలిపారు. కంచె ఏర్పాటు చేయడం ద్వారా తమకు దారి లేదని, రాకపోకలు ఎలా సాగించాలని గ్రామపటేల్ మారుతి డోంగ్రెతో పాటు గ్రామ పంచాయతీ ఈవో సంజీవ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ కమిటీ పెద్దలతో మాట్లాడి దారి ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గోండ్‌గూడ గ్రామ పెద్దలు మడావి ఇంద్రు, చహకటి నాగోరావ్, మెస్రం మహాదు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫీజు గడువు పొడిగించాలి



మాట్లాడుతున్న మెస్రం భాస్కర్

ఆదిలాబాద్‌టౌన్: డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువు పొడిగించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఫెడరేషన్ జిల్లా సమితి నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే విద్యార్థులు అన్ని విధాలుగా ఆర్థికంగా నష్టపోయారని, ఇప్పుడు పరీక్ష ఫీజులను సైతం పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. సెమిస్టర్ ఫీజులను అధికంగా యూనివర్సిటీ పెంచిందని, ఒక్కో పేపర్‌కు రూ.200 అధికంగా పెంచారని, వన్‌టైం పరీక్షకు ఒక్కో విద్యార్థి నుంచి రూ.10వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి జరిగే సెమిస్టర్‌కు ఫీజులను పెంచడం ద్వారా విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. తక్షణమే యూనివర్సిటీ అధికార యంత్రాంగం స్పందించి ఫీజుల గడువును పెంచడంతో పాటు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు మెస్రం హరీష్, కుంర భీమ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీని మళ్లీ ప్రధానిని చేయాలి



ఇంటింటికీ కరపత్రాలు, స్టిక్కర్లు అతికిస్తున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: పార్లమెంట్ ఎన్నికలో బీజేపీకి ఓటు వేసి మళ్లీ నరేంద్రమోదీని గెలిపించాలని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బజర్‌గల్లి, హనుమాన్‌నగర్‌లలో పర్యటించి లబార్థి సంపర్క అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గడిచిన పది సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలు, స్టిక్కర్లను ఇంటింటికీ అందించారు. కమలం పువ్వుకే ఓటు వేసి, ఎంపీగా గొడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, కనక తుకారం, అడావ్ చంపత్‌రావ్, దిలీప్ మోరే, మారుతి దేవ్‌పూజే, గిరి లహనే, గణేష్ పాల్గొన్నారు.